


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 601 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 02 మంగళవారం డిసెంబర్2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## చురుకుగా మేడారాం అభివృద్ధి పనులు

**గద్దెల చుట్టూ పచ్చదనం..ఫడ్లైట్ల ఏర్పాటు -పనులను సమీక్షించిన సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్,డిసెంబర్1
మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుడి చుట్టూరా పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు



## డిజిటల్ అరెస్టులపై సీబీఐకి అనుమతి ఇవ్వండి..



### తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ,డిసెంబర్1
: డిజిటల్ అరెస్ట్‌లపై దేశ అత్యున్నత నా . డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు అల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టురట్ట యింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో జనాలను మోసం చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీబీఐ, ఈడీ అధికారులమంటూ కేటుగాళ్లు 48 లక్షల రూపాయలు కాజేశారు. పోలీసులు నిందితుల నుండి 32 లక్షల రూపాయల నగదు 25 ఏటీఎమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.్యయస్థానం సుప్రీంకోర్టు సీరియస్ అయింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు ప్రారంభించాలని సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తునకు సీబీఐ ప్రధమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బగ్చి నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును సుమోటోగా తీసుకుని విచారించింది.

విచారణ సందర్భంగా సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. దేశంలో డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ అధికారులమంటూ జనాలను భయపెట్టి డబ్బులు దోచేస్తున్నారు. 2025లో డిజిటల్ అరెస్ట్ కేసుల సంఖ్య బాగా పెరిగిపోయింది. పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్లు, సెలెబ్రిటీలు సైతం డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల బారిన పడుతున్నారు. లక్షలు, కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దృష్టి సారించింది







## ఏపీ సినిమాటోగ్రఫీలో నూతన శకం ప్రారంభం

- గ్లోబల్ బ్రాండ్‌గా నిలుస్తోన్న తెలుగు సినిమాలు
- దేశంలోనే సినిమా షూటింగ్ లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఏపీని నిలుపుతాం
- ఏపీలో సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరిస్తాం
- భారత దేశ మీడియా, ఎంటర్ టైన్ మెంట్ రంగంలో పెట్టుబడులు పెడితే అవసరమైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తాం.. కలిసి పనిచేసి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నూతన అధ్యాయం సృష్టిద్దాం
- ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక ఫిల్మ్ స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రీ-రికార్డింగ్ సౌకర్యాలను నిర్మించే వెంచర్లకు ఏపీ ప్రభుత్వం తరపున సంపూర్ణమైన మద్దతు ఇస్తాం
- ప్రతిభకు పెద్దపీట వేస్తూ త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తాం
- ముంబయిలో జరుగుతున్న 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025'లో ఇన్వెస్టర్లతో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- ఫిల్మ్, టూరిజం రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై కీలకోపన్యాసం చేసి పెట్టబడులను ఆహ్వానించిన మంత్రి దుర్గేష్

2

అమరావతి, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాండ్ర, డిసెంబర్ 01 : సినిమా షూటింగ్‌లకు, పర్యాటకానికి ప్రధాన కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఒక కొత్త అధ్యాయాన్ని రచిస్తున్నామని ఈ క్రమంలో ఏపీ సినిమాటోగ్రఫీకి కొత్త శకం ఆరంభమైందని మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. ముంబయి జుహూలోని జేడబ్ల్యూ మారియట్ హెూటల్ లో డిసెంబర్ 1, 2 తేదీల్లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ – 2025'లో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఏపీలో సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరించడానికి వేగంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇది ప్రొడక్షన్ నుండి ఎగ్జిబిషన్ వరకు తెలుగు సినిమా పరిశ్రమను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక విజనరీ డాక్యుమెంట్ అని అభివర్ణించారు. భారతదేశ మీడియా, ఎంటర్ టైన్ మెంట్ రంగంలో పెట్టుబడులు పెడితే అవసరమైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తామని, కలిసి పనిచేద్దామని ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.



**- తెలుగు సినిమా - గ్లోబల్ బ్రాండ్ : మంత్రి కందుల దుర్గేష్**

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హిందీ తర్వాత భారతదేశంలో తెలుగు సినీ పరిశ్రమ రెండవ అతిపెద్దదిగా నిలిచిందన్నారు. ఇది జాతీయ చలనచిత్ర పరిశ్రమకు దాదాపు 20% వాటాను అందిస్తోందని స్పష్టం చేశారు. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 ఏడీ, పుష్ప సిరీస్ లు, సలార్, ఓజీ' వంటి ప్రపంచ స్థాయి సినిమాలు కథాకథనం, విజువల్ ఎఫెక్ట్స్, నిర్మాణ నాణ్యతలో అద్భుతంగా ఉండి బాక్సాఫీస్ కలెక్షన్లలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేసి తెలుగు సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచాయని, తెలుగు సినిమాను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చాయని తెలిపారు. తమిళనాడు తర్వాత అత్యధికంగా ఏపీలో 1,103 స్క్రీన్లు ఉన్నాయని, ఈ రంగానికి తమ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.

సింహగర్జన
www.simhagarjana.com



# ఏపీ సినిమాటోగ్రఫీలో నూతన శకం ప్రారంభం

**- త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాల పునరుద్ధరణ : మంత్రి కందుల దుర్గేష్**

భారతదేశ మీడియా, ఎంటర్ టైన్ మెంట్ రంగ భవిష్యత్తు శక్తివంతంగా ఉందని, డిజిటల్‌గా, ప్రపంచవ్యాప్తంగా తమ రంగం విస్తరించి ఉందని ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఈ పరివర్తనలో ముందంజలో ఉండటానికి కృతనిశ్చయంతో ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ నేపథ్యంలో ఏపీని దేశంలోనే సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తామని స్పష్టం చేశారు. ప్రొడక్షన్ నుండి ఎగ్జిబిషన్ వరకు పరిశ్రమను బలోపేతం చేసేందుకు సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని త్వరలో ఆవిష్కరిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక స్టూడియోలు, డబ్బింగ్ మరియు రీ-రికార్డింగ్ సౌకర్యాలు నిర్మించే వెంచర్లకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని భరోసానిచ్చారు. షూటింగ్‌ల కోసం ప్రభుత్వ, బహిరంగ ప్రాంతాల్లో అనుమతులు వేగంగా, పారదర్శకంగా, అవాంతరాలు లేకుండా లభిస్తాయని వెల్లడించారు. రాష్ట్ర కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు ప్రతిష్టాత్మక నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను త్వరలో పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

**- ఏపీలో పెట్టుబడి పెట్టడం వల్ల విస్తృత ప్రయోజనాలు : మంత్రి కందుల దుర్గేష్**

భారతీయ మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ (ఎం%డ%ఈ) రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ఏపీ ప్రభుత్వం కల్పిస్తున్న ముఖ్య ప్రయోజనాలను ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. ఏపీలో పర్యాటక, ఆతిథ్య రంగాలకు 'పరిశ్రమ హోదా' కల్పించడం వల్ల అన్ని రకాల రాయితీలకు త్వరితగతిన అర్హత లభిస్తుందని స్పష్టం చేశారు. 2029 నాటికి రూ.25,000 కోట్లు (%వి%3 బిలియన్లు) ప్రైవేట్ పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఇప్పటికే దాదాపు రూ.24,000 కోట్ల పెట్టుబడుల పైప్‌లైన్‌ను కలిగి ఉందని, మరో రూ.6,000 కోట్లకు పైగా పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతులు లభించాయని వివరించారు. వేగంగా పెరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల డిమాండ్ ను తీర్చేందుకు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 3500 గదులను 50 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా భూమి కొనుగోలు మరియు లీజుపై 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ మరియు అర్హత కలిగిన పర్యాటక ప్రాజెక్టులకు ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల మినహాయింపును అందిస్తున్నామన్నారు. అంతేగాక ప్రాజెక్ట్ స్థాయిని బట్టి 15 సంవత్సరాల వరకు 100 శాతం స్టేట్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (ఎస్జీఎస్టీ) రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తున్నామని, ఇది నిరంతర ఆదాయ ప్రయోజనాన్ని నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు 25% వరకు మరియు భారీ/మెగా ప్రాజెక్టులకు 10% వరకు ప్రత్యక్ష మూలధన రాయితీలు అందుబాటులో ఉన్నాయని, ఇవి ప్రారంభ పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తాయని వివరించారు. అంతేగాక హాస్పిటాలిటీ యూనిట్లకు పారిశ్రామిక రేట్లకే విద్యుత్ అందించబడుతుందని, విద్యుత్ సుంకం నుండి ఐదేళ్ల మినహాయింపు ఉంటుందని తద్వారా నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు.

**- ఏఐ, వీఎఫ్ఎక్స్, గేమింగ్ వంటి రంగాలకు ఏపీని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి దుర్గేష్**

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి %వి%2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే 'స్వర్ణాంధ్ర విజన్' తమ లక్ష్యమని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఏఐ, వీఎఫ్ఎక్స్, గేమింగ్ వంటి రంగాలకు ఏపీని గ్లోబల్ హబ్‌గా (ఆంధ్రా వ్యాలీ) మార్చేందుకు భారీగా పెట్టుబడి పెడుతున్నామని వెల్లడించారు. బీచ్‌ల నుండి నదుల వరకు, తీర్థయాత్రల నుండి హిల్ స్టేషన్ల వరకు ఆంధ్రప్రదేశ్ సహజ సౌందర్యం, సాంస్కృతిక వారసత్వాల అద్భుతమైన మిశ్రమాన్ని అందిస్తుందని మంత్రి దుర్గేష్ వివరించారు. విశాఖపట్నం, భీమునిపట్నం మరియు కాకినాడ వంటి స్వచ్ఛమైన బీచ్‌ల నుండి గోదావరి మరియు కృష్ణ నదుల సుందరమైన తీరాల వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటకులకు స్వర్గధామం అని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు కోట్లాది మంది భక్తులు తరలివస్తారని, "ఆంధ్రా కాశ్మీర్"గా పిలువబడే అరకు లోయ, లంబసింగి వంటి చల్లని హిల్ స్టేషన్లకు ప్రకృతి ప్రేమికులు భారీగా తరలివచ్చి ఆస్వాదిస్తారని తెలిపారు. ఈ క్రమంలో ఏపీలో విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, శ్రీశైలం, అరకు లోయ, రాజమండ్రి, గండికోటలను ప్రధాన యాంకర్ హబ్‌లను అభివృద్ధి చేస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన "హబ్-అండ్-స్పోక్" మోడల్ ద్వారా అడ్వెంచర్, ఎకో, టెంపుల్, ఫిల్మ్ టూరిజం వంటి 21 థీమాటిక్ సర్క్యూట్‌లలో విభిన్నమైన పెట్టుబడి మార్గాలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ తరుణంలో ప్రపంచ పర్యాటక ప్రచారానికి సినిమాలు అత్యంత శక్తివంతమైన సాధనాల్లో ఒకటిగా భావించి సినిమా,సాంస్కృతిక, పర్యాటక రంగాల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో పాటు తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రత్యేకించి సినిమాటోగ్రఫీని ఉపయోగించి ఏపీ అందాలను ప్రపంచానికి చూపిస్తామని తెలిపారు.

**- ఆంధ్రప్రదేశ్ పర్యాటక విజన్ స్పష్టంగా ఉంది : మంత్రి కందుల దుర్గేష్**

సుస్థిరమైన పద్ధతులు అవలంభించి పర్యాటకులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో




సినిమాటోగ్రఫీ, చారిత్రక వారసత్వాన్ని ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. సుందరమైన లొకేషన్లు, పరిశ్రమ ప్రతిభ, గ్లోబల్ హిట్స్ తమ వద్ద ఉన్నాయని, ఫిల్మ్ టూరిజంలో విస్తృతమైన అవకాశాలున్నట్లు తెలుపుతూ సినిమా రంగంలో ప్రపంచ స్థాయి స్టూడియోలు, డబ్బింగ్ మరియు పోస్ట్-ప్రొడక్షన్ సౌకర్యాలు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను కోరారు. కొత్త ఫిల్మ్ పాలసీ ఈ క్లిష్టమైన మౌలిక సదుపాయాల కల్పనకు రివార్డ్ ఇచ్చేలా ప్రత్యేకంగా రూపొందించబడిందని, స్టూడియోలు, సపోర్ట్ సర్వీసులలో పెట్టే పెట్టుబడులకు పోటీతత్వ ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. అదే విధంగా కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం కాకుండా నిజమైన 'నాలెడ్జ్ ఎకానమీ'ని నిర్మించడానికి, గ్లోబల్ థింకర్స్ మరియు ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా తాము ఉత్సాహంగా పనిచేస్తున్నామన్నారు. ఈ క్రమంలో మీడియా అండ్ ఎంటర్ టైన్ మెంట్ రంగంలో అధిక-విలువైన మేధో సంపత్తిని ఆకర్షించి తమ సృజనాత్మక అవుట్‌పుట్ ప్రపంచ స్థాయిలో పోటీపడేలా, దక్షిణ భారతీయ కంటెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేసే గేట్‌వేగా ఉండాలని భావిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ వేదికగా వెల్లడించారు.

సుస్థిరమైన, పారదర్శకమైన, వ్యాపార అనుకూలమైన పరిపాలన ఏపీ వ్యవస్థకు పునాది అని బాధ్యతాయుతమైన తమ విజన్ ను నమ్మే ప్రతి పెట్టుబడిదారుడికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు కల్పిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. భారతీయ మీడియా, ఎంటర్ టైన్ మెంట్ రంగాన్ని %వి%100 బిలియన్ల స్థాయికి చేర్చడంలో కలిసి పనిచేద్దామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ లో భాగంగా మత్రి కందుల దుర్గేష్ ఉదయం సీఐఐ అధికారి సంజయ్ కత్వానీతో భేటీ అయ్యారు. అనంతరం ప్రస్తుత ఏఐ యుగంలో మీడియా %డ% ఎంటర్‌టైన్‌మెంట్ రంగం యొక్క భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించే ప్రతిష్టాత్మక చర్చలో సీఐఐ జాతీయ మండలి సభ్యులు రాజన్ నవానితో పాటు సోనీ ఎంటర్ టైన్ మెంట్ బిజినెస్ హెడ్ నచికేత్ పంత్వైద్య, ఐబీడీఎఫ్ సెక్రటరీ జనరల్ అవినాష్ పాండే, షెమారో ఎంటర్ టైన్ మెంట్ సీఈవో హిరెన్ గడా, రేడియో మిర్చి సీఈవో యతీష్ మెహ్రిషి, జేడబ్ల్యూ మారియట్ వ్యవస్థాపకుడు, సీఈవో బిరెన్ ఘోష్ లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మంత్రి దుర్గేష్, పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాటలు కలిసి యూట్యూబ్ (ఇండియా) ఎండీ గుంజన్ సోనితో కలిసి చర్చించారు. సినిమా రంగ మౌలిక సదుపాయాల బలోపేతంపై క్యూబ్ సినిమా ఫౌండర్ సెంథిల్ కుమార్, కేంద్ర సమాచార, ఫిల్మ్, బ్రాడ్ కాస్టింగ్ జాయింట్ సెక్రటరీ డా. అజయ్ నాగభూషణ్, భారతీయ నటులు, నిర్మాత ప్రొసెంజిత్ ఛటర్జీ, స్టోరీ రైటర్, ప్రొడ్యూసర్ కె.రవి, ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అభయ్ కుమార్ సిన్హా తదితర ప్యానలిస్ట్ లకు టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట ఫీచర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అదే విధంగా బేసిక్ ప్లై స్టూడియో, పాప ఫిల్మ్ ఎంటర్ టైన్ మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పిక్చర్ పర్ ఫెక్ట్, రాలెట్టా, కల్పవన స్టూడియోస్ ప్రతినిధులతో, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్ మెంట్ పార్క్స్ ఇండస్ట్రీస్ సెక్రటరీ జనరల్ అనిల్ పాద్వాల్, ఇమాజికా వరల్డ్ సీఈవో ధిమంత్ భక్షి, డొమెస్టిక్ బిజినెస్ అండ్ మైస్, థామస్ కుక్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఆమన్ మహజన్ తదితర ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయిన రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు.

## ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అనుచరుల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం - తెలంగాణ జాగృతి నాయకులు

నిజామాబాద్ ప్రతినిధి : ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అనుచరులు తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవితపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జాగృతి రైతు విభాగం అధ్యక్షులు నవీన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోమవారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవీన్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఏ ఒక్క ఎకరానికి నీరు కూడా రాలేదని కవిత పేర్కొన్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాలుగేళ్ళలో ఎందుకు రెట్టిపు అయ్యిందో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని సవాల్ విసిరారు. ఈ కుట్ర వెనుక ఉన్నది బాల్కొండ ఎమ్మెల్యే కాదా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ళు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తర్వాత కూడా పనులు పూర్తికాక నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సాగునీరు రాలేదన్న రైతుల ఆవేదనను కవిత ఎత్తి చూపారని అన్నారు. ఇసుక దందా, గంజాయి దందా, గ్రానైట్ దందాలో ప్రశాంత్ రెడ్డి హస్తం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి నాయకులు కరిపె రాజు, మీసాల శంకర్, అంబటి శ్రీనివాస్, శేఖర్ రాజు, యెండలప్రసాద్, జనార్ధన్, హరీష్, సందీప్, ఆకాష్ , మహిళ నాయకురాలు శోభ, సరిత, రేఖ తదితరులు పాల్గొన్నారు

## పాములపర్తి,పాతూరు గ్రామాలలో పోలీసు కవాతు

గజ్వేల్:
గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మర్కూక్ పోలీసులు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి,మర్కూక్ ఎస్సై దామోదర్ ప్రత్యేక పోలీసు బలగాలతో మరియు పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం పాములపర్తి,పాతూరు గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి,మర్కూక్ ఎస్సై దామోదర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా స్వతంత్రంగా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా వారి యొక్క ఓటు హక్కును వినియోగించుకోవాలని,పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉంటుందని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలిపారు. పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం గ్రామాలలోని ప్రజా ప్రతినిధులతో ప్రజలతో ఎన్నికల నియమావళి,వారు తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన నియమాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ అడ్వకేట్ యూనిట్ ఇంచార్జ్ పెగడ శ్రీనివాసులు

వలేటివారిపాలెం
మండలంలోని అంక భూపాలపురంలో సోమవారం ఉదయం సామాజిక ఫంక్షలను పంపిణీ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ శ్రీనివాసులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో నెట్టబడింది ప్రజల విశ్వాసం పొందిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రాన్ని ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధిని చేయగలిగిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనియాడారు

## రాష్ట్ర సాధన పేరుతో కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకం

**-సోనియా గాంధీ వల్ల తెలంగాణ రాష్ట్రం వచ్చింది-పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి వరకు పాటుపడాలి**

**-జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**







నిజామాబాద్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర సాధన పేరుతో కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకమని, కేసీఆర్ చేసిన దీక్ష వల్ల తెలంగాణ రాలేదని సోనియా గాంధీ వల్ల తెలంగాణ రాష్ట్రం వచ్చిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ దీక్షా దివాస్ చేసిన మాజీ ఎమ్మెల్యేకు జిల్లాలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ఎంతో శ్రమించి తీసుకువస్తే బీజేపీ నేతలు అడ్డుకున్నారని మండిపడ్డారు. బీజేపీ నేతలకు జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కలేదని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ భవిష్యత్తు లేదని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలే విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి ప్రజలు ఆకర్షితులై పలువురినిఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఎన్నికల్లో పేర్కొన్న హామీలు, ఆరు గ్యారెంటీలు ప్రభుత్వం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే జిల్లాకు 35 ఏళ్ళ కళ అయిన ఇంజనీరింగ్ కళాశాల తీసుకువచ్చామనితెలిపారు. తన స్వగ్రామంలో రహత్ నగర్ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం 11 ఎకరాలను దానం చేశానని తెలిపారు. గత పది సంవత్సరాల కాంగ్రెస్ కష్టకాలంలోనూ జిల్లా అధ్యక్షుడిగా మానాల మోహన్ రెడ్డి,నగర అధ్యక్షులుగా కేశ వేణులు పార్టీకి అండగా నిలబడి క్యాడర్ ను కాపాడరని గుర్తు చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కాటిపల్లినగేష్ రెడ్డి, నగర అధ్యక్షులుగా బొబ్బిలి రామకృష్ణలు ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు తమకు పదవులు కేటాయించారని, ఎన్నికల్లో గెలిచి పార్టీకి గిఫ్ట్ గా ఇస్తామని వారు పేర్కొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు,మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి,ఆకుల లలితతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మానాల మోహన్ రెడ్డి,తాహెర్ బిన్ హందాన్,అన్వేష్ రెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్,అంతిరెడ్డి రాజారెడ్డిలు పాల్గొన్నారు.



# జోరు వానలోనూ ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

## -గిరిజన కాలనీలో సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు-దగదర్తి లో ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం..






కావలి,
నెల్లూరు జిల్లా బోగోలు మండలం మంగమూరు గ్రామంలోఎన్‌టీఆర్,సామాజిక భద్రతా పథకం కింద లబ్ధిదారులకు అందించే పింఛన్లను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సోమవారం స్వయంగా గ్రామాల్లో తిరిగి అందజేశారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలం మంగమూరు గిరిజన కాలనీలో జోరు వర్షం కురుస్తున్నా ప్రజల కోసం నేరుగా వారి ఇళ్లకి వెళ్లి పింఛన్లు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా మారింది..వర్షం తెరలు విరజిమ్ముతున్నా అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రాతిపదికన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నూతన వితంతు పెన్షన్ నగదు అందజేసిన ఎమ్మెల్యే,అదే సమయంలో వారికి సంబంధించిన ఆరోగ్య సమస్యలు, కుటుంబ పరిస్థితులను కూడా వివరంగా అడిగితెలుసుకున్నారు.గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, “పెద్దలు ఇంట్లో ఉన్నారు కాబట్టి మనం వాళ్ల వద్దకే వెళ్లాలి” అన్న భావనతో ఒక్కొక్కరినీ పరామర్శించారు. ఈ సందర్భనలో ముంగమూరు గిరిజన కాలనీలో కొంతమందికి పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లుల సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈకు ఫోన్ చేసి రెండు రోజులలోనే గృహాలను ఫీల్డ్‌లో పరిశీలించి బిల్లులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తర్వాత మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ “రాష్ట్రానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు నిరాటంకంగా అందజేస్తున్నాం” అని తెలిపారు.కావలి నియోజకవర్గంలో ఒక్క నెలలోనే 15కోట్ల రూపాయల పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు. కొత్తగా కావలి నియోజక వర్గంలో 78 మందికి వితంతు పెన్షన్ వచ్చాయని.. పెన్షన్ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని రాష్ట్రంలోని ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సమాజం మొత్తానికి రక్షణ కవచంగా మారుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ గారి ఆశీస్సులతో కావలి నియోజకవర్గం దగదర్తి గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టపోతున్నామని ఎమ్మెల్యే తెలియజేశారు..రాష్ట్రంలో ఇంకా దాదాపు 8 లక్షల మంది అవసరం ఉన్న వారికి సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన అనుభవం, దూరదృష్టితో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు..“ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వారి అవసరాలకు అనుగుణంగా అడుగు తప్పని విధంగా మంచి పథకాలు రూపొందిస్తూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో కావలి నియోజకవర్గం అభివృద్ధి పదంలో దూసుకుపోతుందని ఏ కష్టం వచ్చినా జోరు వానలోనూ ప్రజల మధ్యకు వెళ్లి, వారి ఇళ్లకే చేరుకుని, సమస్యలు వినడయిపింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగమూరు గ్రామంలో విశేషంగా నిలిపింది. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేల సేవా భావాన్ని అభినందించారు..బోగోలు మండలం టిడిపి అధ్యక్షులు



మాలేపాటినాగేశ్వరరావు,నాగులవరం సింగల్ విండో ప్రెసిడెంట్ చిలకపాటి వెంకటేశ్వర్లు,సోమశిల ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట్ల మధుబాబు నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి లేలపల్లి సుధీర్, పుంగనూరు టిడిపి సీనియర్ నాయకులు ఎన్నబత్తిన వెంకటేశ్వర్లు,కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, సచివాలయం సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# కీర్తిశేషులు మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





ఒంగోలు, :
ఒంగోలు మాజీ పార్లమెంటు సభ్యులు, కీర్తిశేషులు మాగుంట సుబ్బరామిరెడ్డి 30వ వర్ధంతి కార్యక్రమాన్ని ఒంగోలులోని పివిఆర్ గ్రౌండ్స్ లో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఇంటూరి నాగేశ్వరరావు హాజరై సుబ్బరామిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లోనే, మాగుంట సుబ్బరామిరెడ్డి కందుకూరు ప్రాంతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను దగ్గరగా చూశానని అన్నారు. ఆ రోజుల్లో కందుకూరు పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, సుబ్బరామిరెడ్డి సొంత నిధులతో ఎన్నో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించారని గుర్తు చేసుకున్నారు. కందుకూరు ప్రజలు ఇప్పటికీ సుబ్బరామిరెడ్డి మంచితనాన్ని చెప్పుకుంటూనే ఉన్నారని అన్నారు. కందుకూరు పట్టణంతో పాటు మండల కేంద్రాల్లో కూడా కాలేజీలు ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అలాగే సింగరాయకొండ చుట్టుపక్కల ఏర్పాటు చేసిన పరిశ్రమల ద్వారా కందుకూరు ప్రాంతంలో ఎంతోమందికి ఉపాధి కలిగిందని తెలిపారు. సుబ్బరామిరెడ్డి ఆశయాలను ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కొనసాగిస్తున్నారని, ప్రకాశం జిల్లా అంటేనే మాగుంట కుటుంబం అన్నట్లుగా ఉంటుందని వ్యాఖ్యానించారు.

# పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

కందుకూరు,
26 వ పొగాకు వేలం కేంద్రం వారు బోర్డులో పొగాకు పంట నియంత్రణ పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 26 వ పొగాకు బోర్డ్ వేలం నిర్వహణ అధికారి వి. శివకుమార్ ది గ్రేట్ మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయంగా వాతావరణ పరిస్థితులు ఉన్నాయి కారణంగా పొగాకు పండించే బ్రిజిల్, చైనా, జింబంబే మొదలగు దేశాలలో పొగాకు ఉత్పత్తి అధికంగా ఉన్నదని చెప్పారు. ఈ సంవత్సరం పొగాకు ధరలలో హెచ్చు తగ్గులు ఉండవచ్చును అని రైతులకు తెలియచేశారు. అందువల్ల రైతులు ఎవ్వరూ అధిక ధరలకు బ్యారన్ లను, పొలాలను కౌలుకి తీసుకొని పొగాకు పంటను సాగు చేసి నష్టపోవద్దుని తెలియజేశారు ఈ సంవత్సరం పొగాకు పంట ధరలు అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చునని
మంచి గ్రేడు పొగాకు పండనట్లు అయితే రైతులు మరింత ఇబ్బంది పడవలసి వస్తుందని తెలియచేశారు. పొగాకులో పొటాసియం వినియోగం పెంచడం వల్ల కొంత హై గ్రేడు పొగాకు దిగుబడి సాధించవచ్చు అని పొగాకు మండేల మీద ఎక్కవ కాలం చెడిపోకుండా ఉండే సామర్థ్యం పెరుగుతుందని తెలియజేశారు. రైతు సోదరులు



పోగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలనికోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు క్షేత్ర స్థాయి అధికారి అశోక్ రాజ్ ఐటీసీ కంపెన్ ప్రతినిధి జి.వెంకటేష్ , జిపిఐ కంపెనీ ప్రతినిధి షేక్. అలీ ,రైతులు పాల్గొన్నారు.

# భీష్మ ఏకాదశికి ముస్తాబవుతున్న జనార్ధన స్వామి రథం

ఆలమూరు, : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన నవ జనార్ధన స్వామి ఆలయాల్లో ఆలమూరులో వేంచేసియున్న నాలుగవ ఆలయమైన శ్రీ దేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో గల రథం భీష్మ ఏకాదశి పురస్కరించుకుని ముస్తాబవుతుంది. జనవరి 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీజనార్ధనస్వామి కల్యాణ మహోత్సవంతో పాటు, బీష్మ ఏకాదశి, రథ సప్తమి వేడుకల నాటికి ఈ రథాన్ని సిద్ధం కానుంది. అందులో భాగంగా ఆలమూరు ఎంపీడీఓ ఏ రాజు కుటుంబ సభ్యుల సహకారంతో వారు వ్యక్తిగతంగా సమకూర్చిన నిధులతో ఆధునిక హంగులు, రంగులతో సర్వాంగ సుందరంగా తయారు చేసేందుకు ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. ఆలయ కమిటీ చైర్మెన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్ ఆచార్యులు మంత్రోచ్చారణల మధ్య ఎంపీడీఓ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ రథాన్ని సప్తవర్ణ శోభితంగా అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తయారుచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు ఆకాక్షించారు.పాలకమండలి సభ్యులు, బొబ్బా రాంబాబు, డి, సత్య లక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, కొప్పాడి జై బాబు, కట్టా శ్రీనివాస్, దార దుర్గ భవాని, సబ్బవరపు రావయమ్మ, కట్టా రాజు, అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.






# టిడిపి కార్యకర్త భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు,
ఉలవపాడు మండలం ఉలవపాడు పంచాయతీకి చెందిన టిడిపి కార్యకర్త సన్నిబోయిన బ్రహ్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు.కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం బ్రహ్మయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెబుతూ, టిడిపి పార్టీ ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటుంది అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, ఉలవపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరుతోటి గిరిబాబు, పార్టీ నాయకులు అమ్మనబ్రోలు రమేష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

# టివిసి ట్రస్ట్ తరపున గోసాలకు 25 వేల రూపాయులు విరాళం.

కడియం
గోసాలల సంరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. కడియం శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో గల గోసాల నిర్వహణ నిమిత్తం సోమవారం తాడాల విష్ణు చక్రవర్తి, రాజరాజేశ్వరి దంపతులు ఇరవై ఐదువేల రూపాయల విరాళం అందించారు. బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు గిరజాల బాబు చేతుల మీదుగా, గోవుల పోషణ నిమిత్తం విరాళాన్ని అందించినట్లు తాడాల చక్రవర్తి తెలిపారు. గిరజాల బాబు మాట్లాడుతూ గోవుల పోషణ వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, గోవులను పెంచే ఇంట్లో ఆర్థిక సమస్యలు, అనారోగ్య సమస్యలు ఉండవని తెలిపారు. ఈకార్యక్రమంలో అయితిరెడ్డి అయ్యప్ప, గణేషుల చక్రవర్తి, పున్నమి రాజు వీర్రాజు, కుసునూరి సత్యనారాయణ (బాబులు), మర్రి చందర్రావు, పడాల గోవిందు, పిండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు




# తాత మనవడు.. ఒక తెలుగు సినిమా వైభవం!




దర్శక రత్న దాసరి నారాయణరావు ఇలాంటి సినిమా మొదటి ప్రయత్నంగా తీసారంటే అసలు నమ్మబుద్ధి కాదు. తెలుగు సినిమా ఫార్ములా ఒరవడిలో కొట్టుకు పోతున్న సమయం.. ఎన్టీఆర్, కృష్ణలు పగ ప్రతీకారం నిండిన యాక్షన్ సినిమాలు.. ఎఎన్నార్, శోభన్ లు ప్రేమకి సంబంధించిన సినిమాలు చేసుకుంటూ పోతూ.. రంగు రంగుల సినిమాల హోరు మధ్యలో వచ్చిన తెలుపు.. నలుపు.. సినిమా ఇది.

పాలకొల్లు నుండి వచ్చి చాలా సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్ గా.. మాటల రచయితగా పనిచేస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తున్న దాసరికి ప్రతాప్ ఆర్ట్స్ నిర్మాత కె.రాఘవ తొలిసారి నిర్మించే సినిమాకి పనిచేసే అవకాశం.. దాసరి చెప్పిన కథ నచ్చింది. పాత్రధారులు ఎంపిక చేయాలని అనుకున్నప్పుడు ఎస్.వి.రంగారావు పాత్ర తాతగా రాసుకున్నప్పుడే ఫిక్స్. ఆయన ప్రక్కన అంజలీదేవి హీరోగా శోభన్ బాబును అనుకున్నారు దాసరి. కానీ నిర్మాత నేను అంత బడ్జెట్ ఇవ్వలేను అనేసరికి హీరోగా ఎవరిని పెడదామని ఆలోచించి చివరికి రాజబాబును నిర్ణయించారు. హీరోయిన్ విజయ నిర్మల,
సత్యనారాయణ, రాజసులోచన ఒక జంట.

గుమ్మడి పాత్రకి ముందు దాసరి తనకు అప్తుడైన నాగభూషణంను అడిగారు. ఆయన రెమ్యూనరేషన్ ఎక్కువ అడిగే సరికి కోపం వచ్చి గుమ్మడిని పెట్టారు. అలా కాస్టింగ్ పూర్తయ్యింది.

'నువ్వు మీ నాన్నకి చేసిన మర్యాద రేపు నీకు నేను చెయ్యాలి కదయ్యా' ఇదే కథ లైన్. కొడుకు తల్లి దండ్రులులను మోసం చేస్తే... మనవడు ఆ కొడుకుకు ఎలా బుద్ధి చెప్పాడు అన్నదే కథ. చిన్న బడ్జెట్లో 30 రోజుల్లో తీశారు. 23 మార్చి 1973న విడుదల. ప్రేక్షకులు అపూర్వంగా ఆదరించారు. మార్చి 15న ఎఎన్నార్ బంగారుబాబు, మార్చి 29 ఎన్టీఆర్ దేశోద్ధారకులు రిలీజ్. ఇద్దరు అగ్ర నటులు సూపర్ హిట్ సినిమాల మధ్యలో రిలీజ్ ఐనా ఈ సినిమా సూపర్ హిట్ అయ్యి 365 రోజులు ఆడింది. ఈ సినిమాకి హీరో ఎస్.వి.రంగారావే. టైటిల్స్ లో కూడా మొదట ఆయన పేరే వేసారు. విశ్వ నట చక్రవర్తి ఎస్. వి. రంగారావు అని, ఆయన నటన గురించి కొత్తగా ఏం చెప్పాలి సినిమా మొత్తం సెకండ్ హాఫ్ లో కొంత భాగం తప్ప తనే నడిపించారు. మేనకోడలు గర్భవతి అని తెలిసినప్పుడు, కొడుకు పెళ్లి చేసుకుంటున్నప్పుడు, కంటి చూపు పోయినపుడు, భార్య చనిపోయినప్పుడు ఆ సన్నివేశాల్లో ఆయన నటన వర్ణించటం నా వల్ల కాదు. అంత అర్హత కూడా లేదు నాకు. ఇక ఆయన భార్యగా అంజమ్మ నటన కూడా అద్భుతం. ముఖ్యంగా కొడుకు ఇంట్లోనే పని చేస్తున్నట్లు తెలిసిన సన్నివేశంలో ఆవిడ బాధ, చిరాకు, అసహ్యం, అవమానం అన్ని ఎక్స్ప్రెషన్ లు ఒకేసారి చూపించారు. భార్య విధేయుడుగా సత్యనారాయణ కూడా పేరెంట్స్ కి భార్యకి మధ్య నలిగిపోయే క్యారెక్టర్ మెప్పించారు. రాజసులోచన కూడా సరిగ్గా సరిపోయింది.

ఇక అప్పటికే పేరు మోసిన కమెడియన్ రాజబాబు హీరోగా ఎక్కడా తనలోని హాస్య నటుడుని కనిపించకుండా కరుణరసం, బాధ, జాలి, మాత్రమే ఆయన నటనలో చూపించాడు. విజయ నిర్మల రాజబాబు పక్కన హీరోయిన్ గా నటించటం ఆవిడ గొప్ప మనసుకి ఉదాహరణ. అల్లు రామలింగయ్య, గుమ్మడి, కొమ్మినేని మిగతా పాత్రలలో మెప్పించారు. దాసరికి పునాది వేసిన చిత్రం ఒక్క సినిమాతోనే ఆయన గొప్ప దర్శకుల జాబితాలోకి వెళ్ళిపోయారు. అప్పటివరకు ఒక లెక్క ఈ సినిమా తర్వాత ఒక లెక్క. ఎన్టీఆర్ సినిమా, ఎఎన్నార్ సినిమా, కృష్ణ సినిమా అనేవాళ్ళు. అప్పటినుండి హీరో ఎవరైనా సరే దాసరి సినిమా అనే పేరు వచ్చింది. 150 పైగా సినిమాలు తీసి గిన్నిస్ బుక్ లోకి ఎక్కారు. ఆయన చేసిన ప్రయోగాలు తెలుగులో ఎవరూ చేయలేదు..అన్ని రకాల సినిమాలు చేశారు. ఎన్నో బ్లాక్ బస్టర్స్... ఎన్నో సందేశాత్మక చిత్రాలు, ఎంతో మందికి జీవితం, ఎందరో శిష్యులు, ఒక దర్శక యూనివర్సిటీ ఆయన. తెలుగు సినిమా పెద్ద. అగ్రనటులు కూడా దాసోహం. అకాల మరణం పొందారు కానీ ఉంటే ఇంకా సినిమాలు తీస్తూనే ఉండేవారు.

సి.నారాయణ రెడ్డి, కొసరాజు పాటలు,
రమేష్ నాయుడు సంగీతం మహాద్భుతం.

ఈ నాడే బాబు నీ పుట్టినరోజు, అనుబంధం. ఆత్మీయత అంత ఒక భూటకం.

ఏమిటో ఈ లోకమంతా పాటలు జీవితంకి అద్దం పట్టేలా ఉండి మనస్సును తాకేలా ఇప్పటికీ వీనులవిందుగానే ఉంటాయి. ఈ సినిమా కొత్త దర్శకులకు ఒక డిక్షనరీ, ఆ టేకింగ్, ఆ సింబాలిక్ షాట్స్, ఆ స్క్రీన్ ప్లే చాలా నేర్చుకోవచ్చు.

ఎస్వీఆర్ కి అంజలీదేవి వాళ్ళ మేనకోడలు గర్భవతి అని చెప్పే సీన్ బ్యాక్ గ్రౌండ్ లో ట్రైన్ వెళ్తున్నట్లు సౌండ్ పెట్టి విషయం పూర్తయ్యే సరికి ట్రైన్ వెళ్ళిపోవటం ఎంత గొప్పగా తీసారో. అప్పట్లోనే ఇలాంటి సీన్ లు ఎన్నో దర్శక ప్రతిభను చూపెడతాయి. ఈ సినిమా ప్రేరణతో తర్వాత ఎన్నో సినిమాలు వచ్చాయి. దాదాపు అన్నీ హిట్ లే. ఏ తరం వారికైనా నచ్చే సినిమా.

ఇప్పటి తరాలకు కూడా చూపించవలసిన సినిమా.

**తాత మనవడు**

కొసమెరుపు : ఎస్.వి.రంగారావు, కైకాల సత్యనారాయణ, అంజలీదేవి, గుమ్మడి, దాసరి నారాయణరావు, రాజబాబు, విజయనిర్మల, వీళ్లు ఎంత గొప్ప వాళ్ళో అందరికీ తెలుసు. ప్రభుత్వాలకీ తెలుసు అయినా ఒక్కరికి కూడా కనీసం పద్మశ్రీ కూడా ఇవ్వలేదు. పద్మశ్రీలు, పద్మభూషణ్ లు ఎలాంటి వారికి ఇస్తున్నారో కూడా మనం చూస్తున్నాం.

## వేదిక నుండి - వెండి తెరకు-పీలా కాశీ మల్లికార్జునరావు



మల్లికార్జునరావు (1950 అక్టోబరు 10 - 2008 జూన్ 24) తెలుగు సినీ, రంగస్థల హాస్య నటులు. అతని పూర్తి పేరు పీలా కాశీ మల్లికార్జునరావు. పాఠశాల దశనుంచే నాటకాల్లో నటించే వారు. 50 నుంచి 60 నాటకాలూ, ఏకపాత్రాభినయం పాత్రలూ అతనికి నటన మీద మంచి పట్టు లభించేదానికి దోహదపడ్డాయి.

**- తొలి జీవితం :**

మల్లిఖార్జునరావు, పీలా పోతునాయుడు, పీలా అచ్చియమ్మ దంపతులకు 1950 అక్టోబరు 10న అనకాపల్లిలోని గవరపాలెంలో జన్మించారు. అతని తండ్రి పీలా పోతునాయుడు స్వాతంత్ర్య సమరయోధుడు, అనకాపల్లిలో భూస్వామి. మల్లికార్జునరావు గవరపాలెంలో గౌరీ వ్యాయామశాలను ఏర్పాటు చేశారు. అతని మార్గదర్శకత్వంలో మళ్ల వెంకట మాణిక్యాలు 1984 ఒలింపిక్స్‌లో కూడా పాల్గొన్నారు.

భమిడిపాటి రాధాకృష్ణ రాసిన లెక్కలు తెచ్చిన చిక్కులు అతని తొలి నాటకం. అతనిని రంగస్థలంపై నటుడిగా నిలబెట్టింది పలుకే బంగారమాయె చిత్రం. ఇందులో నిర్మాత వేషం మల్లికార్జునరావుకి ఎంతో గుర్తింపు నిచ్చింది. అనకాపల్లిలోనే ఎ.ఎమ్.వి.ఎమ్ ఆసుపత్రిలో కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. అక్కడి ట్రేడ్ యూనియన్‌కి నాయకత్వం వహించారు. అతనికి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

**- సినీ ప్రస్థానం :**


దివంగత నటులు రావు గోపాలరావు సహకారంతో చిత్రసీమలోకి ప్రవేశించారు. 1972లో తులసి అనే చిత్రంలో చిన్నవేషం వేశారు. ఆ సమయంలోనే పార్వతీ పరమేశ్వరులు చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేశారు. తరువాత నాగమల్లి లాంటి కొన్ని చిత్రాల్లో నటించారు. వంశీతో ఏర్పడ్డ పరిచయం అతని సినీజీవితాన్ని మలుపు తిప్పింది.

వంశీ మొదటిచిత్రం మంచు పల్లకీలో చిన్న పాత్ర పోషించారు. అన్వేషణలో పులిరాజుగా మల్లికార్జునరావు నటన చిత్రసీమను ఆకట్టుకొంది. అదే సమయంలో తన తండ్రి అస్వస్థతకు లోనైతే అనకాపల్లి వెళ్లడం వల్ల అవకాశాలు కోల్పోయారు. 'లేడీస్ టైలర్'లో బట్టల సత్యం పాత్ర తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 350కి పైగా సినిమాల్లో నటించారు. తమ్ముడు సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డును పొందారు. ఏప్రిల్ ఒకటి విడుదల, కనకమాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్‌ట్రూపు, హలో బ్రదర్, ఆలీబాబా అరడజను దొంగలు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, బద్రి, ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు, ఎవడి గోల వాడిది, మా ఆయన సుందరయ్య (2001) లాంటి చిత్రాలు అతనికి ఏంతో పేరు తీసుకొచ్చాయి. మల్లికార్జునరావు నటనలో తనకంటూ ఓ పంథాను ఏర్పరచుకొన్నారు. తొలినాళ్లలో రావుగోపాలరావు ప్రభావం ఉండేది. తన సంభాషణ శైలిలో ఉత్తరాంధ్ర యాసని మేళవించడంతో జనాన్ని సులభంగా ఆకట్టుకోగలిగారు. ఆ యాసనీ, మాండలికాన్నీ సాధికారికంగా మాట్లాడగలిగిన నటుడిగా గుర్తింపు పొందారు. అలాగే గ్రామీణ నేపథ్యం ఉన్న పాత్రలకు జీవంపోసే నటుల్లో అతను ముందుండే వారు.




# రాజ్ నిడుమోరుతో సమంత ఏడడుగులు

## -రూమర్స్‌ను నిజం చేసిన జంట



టాలీవుడ్ స్టార్ నటి సమంత గత కొన్ని రోజులుగా నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. అందుకు కారణం రెండో పెళ్లే. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రాజ్ నిడుమోరుతో సమంత డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంత కాలంగా తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. త్వరలో వీరు పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు ఆ రూమర్సే నిజమయ్యాయి. సామ్-రాజ్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూర్‌లోని ఇషా యోగా సెంటర్లో గల లింగ భైరవి ఆలయంలో వీరి వివాహం జరిగింది. దక్షిణాది సంప్రదాయం ప్రకారం వీరు పెళ్లి చేసుకున్నారు. ఎరుపు రంగు కంచిపట్టు చీరలో సమంత ఎంతో అందంగా రెడీ అయ్యారు. ఉదయం నిశ్చితార్థం, ఆ వెంటనే పెళ్లి కూడా జరిగిపోయింది. ఈ వేడుకకు దగ్గరి బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. ఈ శుభవార్తను సమంత ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ఈ మేరకు పెళ్లి ఫొటోలను కూడా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, అభిమానులు సామ్-రాజ్ జంటకు శుభకాంక్షలు చెబుతున్నారు. పలువురు సెలబ్రిటీలు సైతం శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com